సాక్షి
వికారాబాద్
బుధవారం । 30 । అక్టోబర్ । 2024





## యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు

గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను విక్రయిస్తున్నారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. 8లో▸



## కుసుమ సాగుకు..

కుసుమ సాగుకు నల్లరేగడి నేలలు ఎంతో అనుకూలం. జిల్లా రైతులు అధిక సంఖ్యలో కుసుమ పంటను సాగు చేస్తున్నారు. 8లో▸



## ఉల్లిపై ఆసక్తి

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనేది సామెత. నిత్యం తినే కూరల్లో ఉల్లిని వినియోగిస్తుంటారు. 9లో▸

## న్యూస్‌రీల్

### పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



అనంతగిరి: పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వికారాబాద్‌లోని క్లబ్ హాల్‌లో జిల్లా ముఖ్య ఉద్యోగ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని.. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యకులు భాస్కర్, నర్సింలు, శ్రీనివాస్, పరమేష్, నరేందర్, రవీంద్, రాఘవేందర్, మైపాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### డీఎంహెచ్ఓ బదిలీ

అనంతగిరి: వికారాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వాన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ వెంకటరమణను డీఎంహెచ్ఓగా నియమించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పల్వాన్‌కుమార్ రెండేళ్ల పాటు జిల్లాలో సేవలందించారు. ఆయన్ను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయడంతో పాటు మెదక్ జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు.

### 5న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



తాత్కాలిక కమిటీ సభ్యులు

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని నవంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుందామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఎలాంటి కక్ష సాధింపుధోరణికి పోకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగేందుకు ఉద్యమకారుల సంక్షేమాన్ని సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 5న పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో ఉన్న వాద్యాల వసంత రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం తాత్కాలిక అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా కళ్లెం నర్సింహారెడ్డి, రాంబల్ నాయక్, మంగులాల్ నాయక్, ఎమ్మె సత్తయ్య, గౌరవ అధ్యక్షులుగా పినపాక ప్రభాకర్, మిట్టు నాయక్, చైర్మన్‌గా వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లుగా అర్ల యాదయ్య, జాంగారి రవి, కన్వీనర్లుగా నక్కల వెంకటేశ్‌గౌడ్, మన్నె నారాయణ, కోకన్వీనర్లుగా మహ్మద్ సిరాజుద్దీన్, జాంగారి నర్సింలు, కోఆర్డినేటర్‌గా దిలీప్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

# ఆనంద రవళి.. దీపావళి

**వెలసిన టపాసుల దుకాణాలు**

- మార్కెట్‌లోకి ప్రమిదలు
- ధనలక్ష్మి పూజకు ఏర్పాట్లు చేసుకుంటున్న మహిళలు, వ్యాపారులు
- బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

పరిగి: దీపావళి పర్వదినానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. చీకటిని పారదోలుతూ వెలుగు తెచ్చే పండుగ.. విజయానికి ప్రతీకగా దీపావళి పర్వదినాన్ని జరుపుకొంటారు. చెడుపై మంచి గెలుపునకు సంకేతం.. ఇంటిల్లిపాది లక్ష్మీ అమ్మవారికి ఆహ్వానం పలుకుతూ దీపాలు వెలిగిస్తారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. దీనిని దివాలి అని కూడా పిలుస్తారు. ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల వద్ద దీపాలు, కొవ్వొత్తులను వెలిగించి సంపద, అదృష్టం, శ్రేయస్సుకు ప్రతీక అయిన లక్ష్మీదేవిని పూజిస్తారు. చిన్న పిల్లలు మొదలుకొని పెద్దల వరకు టపాసులు కాల్చుతూ ఆనందోత్సాహాల నడుమ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వాయు, ధ్వని కాలుష్యాన్ని పెంచే టపాసులు కాల్చకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు కాల్చే వాటితోనే ఎక్కువ కాలుష్యం వెదజల్లుతుందని చెబుతున్నారు. పాము బిళ్లలు, భూ చక్రాలు, చిచ్చుబుడ్డీలు కాల్చడం వలన పొగ ఎక్కువ విడుదలై ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందని వైద్యులు అంటున్నారు. కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తూ టపాసులు కాల్చాలని సూచిస్తున్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

- ❖ టపాసులు కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.
- ❖ నిప్పు రవ్వలు పడితే త్వరగా వ్యాపించకుండా కాటన్ దుస్తులు ధరించాలి.
- ❖ పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండాలి.
- ❖ బాణసంచా కాల్చేటప్పుడు చెవుల్లో దూడి పెట్టుకోవడం మరచిపోరాదు.
- ❖ సీమ టపాకులను దూరం నుంచి కాల్చాలి.
- ❖ రాకెట్లు, తారాజువ్వలు వంటి వాటిని చేతిలో పెట్టుకొని వెలిగించరాదు. ఒక్కోసారి అవి పేలిపోతాయి. చేతులు కాలిపోయే ప్రమాదం ఉంది.
- ❖ రాకెట్లను పూరిళ్లకు దూరంగా.. విశాలమైన ఇంటి ఆవరణలోనే కాల్చాలి.
- ❖ పేలని పటాకులను నీటిలో లేదా ఇసుక బక్కెట్‌లో మాత్రమే వేయాలి.
- ❖ భూ చక్రాలు కాల్చేటప్పుడు పాదరక్షలు ధరించడం మంచిది.
- ❖ టపాసులు ఉంచే ప్రాంతంలో కొవ్వొత్తులు ఉంచరాదు.
- ❖ పై జాగ్రత్తలు పాటిస్తూ టపాసులు కాల్చాలని అధికారులు సూచిస్తున్నారు.



పరిగి పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం



ప్రమిదలు

**ఇంటికి దీపకాంతులు**

దుద్యాల్: దీపావళి పండుగ వచ్చిందంటే ప్రతి ఇళ్లు, దుకాణం, పరిశ్రమలు దీప కాంతులతో వెలిగిపోతాయి. పండుగకు రెండు రోజులే ఉండటంతో మార్కెట్‌లోకి మట్టి, రంగురంగుల ప్రమిదలు వచ్చాయి. వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వీధులు సందడిగా మారాయి. వ్యాపారులు అందమైన ప్రతిమలను అందుబాటులో ఉంచారు. మండలంలోని ప్రతి గ్రామంలో టపాసుల దుకాణాలు ఏర్పాట్లు చేశారు. బాణసంచా కొనుగోలు ప్రక్రియ మొదలైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి టపాసల ధర భారీగా ఉన్నట్లు ప్రజలు తెలిపారు.



వికారాబాద్ సమీపంలోని అనంతగిరి కొండల అందాలు

# టూరిజంపై కదలిక

**పర్యాటక కేంద్రంగా అనంతగిరి గుట్ట**

- టెండర్లకు సిద్ధమవుతున్న అధికారులు
- డీపీఆర్ బాధ్యత ఎల్‌అండ్‌టీకి అప్పగింత
- రూ.110 కోట్లతో 213 ఎకరాల్లో అభివృద్ధి పనులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ముందుకు..
- అడ్వెంచర్ టూరిజం, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుపై చర్చలు
- పెరగనున్న ఉపాధి అవకాశాలు

వికారాబాద్: జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న అనంతగిరి కొండలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసే విషయంలో మళ్లీ కదలిక వచ్చింది. డీపీఆర్ తయారీ బాధ్యతలు ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. మాస్టర్ ప్లాన్, చేపట్టబోయే పనుల గురించి అధికారులు ఎల్‌అండ్‌టీ సిబ్బందితో చర్చించారు. డీపీఆర్ ఆధారంగా టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. 213 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టబోయే పనులకు రూ.110 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మొద టి విడతగా ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేయనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనంతగిరి కొండలు, అటవీ ప్రాంతం తోపాటు సమీపంలోని సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులకు మరింత పర్యాటక శోభ రావడం ఖాయం. అనంతగిరి పర్యాటక అభివృద్ధిలో భాగంగా సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేలా ప్రణాళిక తయారు చేశారు.

**అనుకూల అంశాలు**

జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో అనంతగిరి గుట్టలు ఉన్నాయి. వీటిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనేక అనుకూల అంశాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధానికి 70 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. రోడ్డు విస్తరణ పనులు జరిగితే నగర వాసులు గంటలో ఈ ప్రాంతానికి చేరుకుంటారు. బెంగళూరు, ముంబై హైవేల నుంచి కూడా గంటలోపే ఇక్కడికి రావచ్చు. రీజనల్ రింగ్‌రోడ్డు అందుబాటులోకి వస్తే కేవలం 15 నిమిషాల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండలు, రోడ్డులో అందమైన మలుపులు, గుట్టపై ఎంతో చరిత్ర కలిగిన అనంతపద్మనాభ స్వామి ఆలయం, ట్రెక్కింగ్ స్పాట్‌లు, అనేక రకాల పక్షిజాతులు, జంతు జాతులు అనంతగిరి అడవిలో ఉన్నాయి.తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన కాటేజీలు, పక్కనే బుగ్గ రామేశ్వర ఆలయం, కోట్‌పల్లి,సర్పన్‌పల్లి ప్రాజెక్టులు..వీటిలోబోటింగ్ పర్యాటకులను కట్టిపడేస్తాయి. ఇలాంటి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకుల సందడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు అభిస్తాయి.

**అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా..**

సాధారణంగా పర్యాటక కేంద్రాలను రెండు విధాలుగా అభివృద్ధి చేస్తారు. ఇందులో మొదటిది అటవీ అందాలను వీక్షించడం, ఆలయాల సందర్శన వంటివి ఉంటాయి.. రెండోది అడ్వెంచర్ టూరిజం(సాహస పర్యాటకం)అభివృద్ధి.. ఇందులో ప్రధానంగా యువత ఇష్టపడే సాహస ట్రెక్కింగ్, రోప్ వేలు వంటివి ఏర్పాటు చేస్తారు. అనంతగిరి కొండల్లో ఈ రెండు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.110 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేయగా.. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతం రాష్ట్ర రాజధానికి సమీప ప్రదేశం కావడంతో టూరిజంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఎకో పార్కు, కన్వెన్షన్ హాళ్లు, ట్రెక్కింగ్, రోప్ వేస్, హోటల్స్, ఆలయ అభివృద్ధి, వ్యూ పాయింట్ డెవలప్‌మెంట్, పార్కులు, ఈటింగ్ హాల్స్, పక్షులు, జంతువులను వీక్షించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. పర్యావరణం, చెట్లు, పక్షి, జంతుజాతుల జీవనానికి ఎలాంటి ఆటంకం, ఇబ్బంది కలగకుండా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు. రోజుకు 5వేల మంది పర్యాటకులు వచ్చినా.. వెయ్యి మంది రాత్రి బస చేసినా ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు వెయ్యి మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

**స్వదేశీ దర్శన్ పథకంలో ఎంపిక**

స్వదేశీ దర్శన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తోంది. రెండో విడతలో అనంతగిరిని ఎంపిక చేశారు. తెలంగాణలో రెండు ప్రదేశాలు ఎంపిక కాగా అందులో అనంతగిరి, యాదాద్రి భువనగిరి కొండ ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.

# కరన్‌కోట్ పీఎస్ పనితీరు భేష్

- జిల్లాలో క్రైం రేటు తగ్గుముఖం
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం
- ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్: కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పనితీరు బాగుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో పది నెలల్లో 228 కేసులు నమోదుకాగా మేజర్ క్రైం జరగలేదని పేర్కొన్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడటంతో సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ వచ్చినట్లు వివరించారు. ఇందుకు కృషి చేసిన ఎస్‌ఐ విఠల్‌రెడ్డిని అభినందించారు. జిల్లాలో క్రైం రేటు తగ్గిందన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువకులకు కళా బృందాలతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 8 కొత్త పోలీస్‌స్టేషన్ భవనాల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు, ముందు సీటులో కూర్చున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాండూరు పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం తోపాటు సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరిస్తామని అన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐలు పవన్‌కుమార్, రాజశేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

**సైబర్ మోసగాళ్ల ఉచ్చులో..**

చదువుకున్న వారే సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడుతున్నారని ఎస్పీ అన్నారు. ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.80 లక్షలు మోసపోయి తన వద్దకు వచ్చాడని గుర్తు చేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఆఫర్ల పేరిట ప్రలోభాలకు గురి చేస్తుంటారని, అలాంటి వారిని నమ్మరాదని సూచించారు.

**ఇసుక అక్రమ రవాణా తగ్గింది**

జిల్లాలో నాలుగు నెలల నుంచి ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందని ఎస్పీ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ**

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని వివరించారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం**

పెద్దేముల్:నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకమని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని నాగులపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగులపల్లిని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. నాగులపల్లి ప్రజలు రూ.3,14,500లతో 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, పెద్దేముల్ ఎస్‌ఐ గిరి పాల్గొన్నారు.



తాండూరు రూరల్: కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటవ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నవంబరు 28వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఏజెంట్ల జాబితాను సమర్పించాలని రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. ఓటరు నమోదుకు నవంబర్ 28తో గడువు ముగుస్తుందన్నారు. నవంబరు 9, 10 తేదీల్లో ఓటరు నమోదుకు బూత్‌స్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో 9,90,858 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఇందులో 4,88,679 మంది పురుషులు, 5,02,144 మంది స్త్రీలు, 35 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు వివరించారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా**

పరిగి నియోజకవర్గంలో 2,68,583 మంది ఓటర్లు ఉండగా అందులో 1,34,482 మంది పురుషులు, 1,34,092 మంది స్త్రీలు, 9మంది ఇతరులు ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,32,884 మంది ఓటర్లు నమోదు కాగా 1,15,531 మంది పురుషులు, 1,17,339 మంది స్త్రీలు, 14 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తాండూరు నియోజకవర్గంలో 2,45,941మంది ఓటర్లు ఉండగా 1,19,081 మంది పురుషులు, 1,26,853 మంది స్త్రీలు, ఏడుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,46,450 మంది ఓటర్లు ఉండగా 1,19,585మంది పురుష ఓటర్లు, 1,23,860 మంది స్త్రీ ఓటర్లు. 5 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

# సమగ్ర సర్వేకు సన్నద్ధం కండి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్

అనంతగిరి: త్వరలో చేపట్టబోయే సమగ్ర ఇంటింటి సర్వేకు సన్నద్ధం కావాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఇంటింటి సర్వేపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. సర్వే కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు సిబ్బందిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. వారి వివరాలను తమకు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఎమ్యూనేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ఇందుకోసం ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా.. సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సర్వే ప్రభుత్వ పథకాల అమలుకు ఎంతో కీలకం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించారు. అంతకుముందు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా వచ్చిన సిక్తా పట్నాయక్‌కు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి మొక్క అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, సీపీఓ అశోక్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్

**పకడ్బందీ ఏర్పాట్లు**

సమగ్ర ఇంటింటి సర్వే కోసం పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం సచివాలయం నుంచి సీఎస్ శాంతకుమారి సమగ్ర ఇంటింటి సర్వేపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నారాయణపేట కలెక్టరేట్ నుంచి సిక్తా పట్నాయక్ వికారాబాద్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇంటింటి సర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## క్లుప్తంగా

### పేదల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**కుల్కచర్ల:** పేద ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందుకు తగ్గట్లుగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎవరూ మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంక్షేమ పథకాలను పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఠాణాలో ఓపెన్ హౌస్



కోట్‌పల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్రవంతి

**బంట్వారం:** పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బంట్వారం, కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లలో విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మహిపాల్‌రెడ్డి, స్రవంతిలు విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### వికారాబాద్ యువతికి గోల్డ్ మెడల్



కేంద్రమంత్రి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న గౌతమిశ్రీ

**అనంతగిరి:** వికారాబాద్‌కు చెందిన పోకల గౌతమి శ్రీ ఐఐటీ వారణాసిలో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ ఇటీవల పూర్తి చేసింది. ఆమె చూపిన ప్రతిభకు ఐఐటీ తరఫున గోల్డ్ మెడల్ అందజేశారు. ఈ మెడల్‌ను సోమవారం రాత్రి జరిగిన స్నాతకోత్సవంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు, అధ్యాపకులు, స్నేహితులు, విద్యావంతులు అభినందిస్తున్నారు.

### వృద్ధురాలిపై అత్యాచారం

**తలకొండపల్లి:** సభ్యసమాజం తలదించుకునేలా ఓ వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలి(60) భర్త కొన్ని సంవత్సరాల క్రితమే మరణించాడు. ఆమెకు ముగ్గురు సంతానం. ప్రస్తుతం ఒక్కతే ఇంట్లో ఉంటుంది. ఇంటి పక్కన ఉండే రమేశ్ వారం రోజుల క్రితం ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తాజాగా ఆమె ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### పని కోసం వెళ్తూ.. ప్రాణాలు విడిచి

**షాద్‌నగర్‌రూరల్:** పనికోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలను పోగొట్టుకున్న సంఘటన పట్టణంలోని దూసకల్ బైపాస్ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన చందన్‌కుమార్(30), సూరజ్‌కుమార్ బావ బావమరుదలు. వీరు రామాంతాపూర్‌లో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఇరువురూ పని నిమిత్తం మంగళవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో పట్టణ సమీపంలోని దూసకల్ బైపాస్ రహదారి ముఖ్య కూడలికి రాగానే జడ్చర్ల వెళుతున్న డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందన్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున మరో వ్యక్తి గాయాలతో బయట పడ్డాడు. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుశీల తెలిపారు.



# యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు

- ఎల్‌పీఎస్ భూములను ఇతరుల పేరుతో మారుస్తున్న వైనం
- పేదలకు పంచిన ప్రభుత్వ భూములు పక్కదారి
- రెవెన్యూ అధికారులు, మధ్యవర్తుల కుమ్మక్కుతో కొనసాగుతున్న తతంగం
- దోమ మండలం మోత్కూర్ పరిధిలో రిజిస్ట్రేషన్లు





దోమ తహసీల్దార్ కార్యాలయం

**దోమ:** పేదల కోసం పట్టా భూములను కొనుగోలు చేసిన గత ప్రభుత్వం అర్హులైన వారికి వీటిని పంపిణీ చేసింది. ప్రభుత్వ భూములుగా పట్టాలు పొందిన సదరు లబ్ధిదారులు ఇందులో సాగు చేసుకుని జీవనం సాగించాలి. వీటిని ఇతరులకు విక్రయించకూడదు. అయితే కొంతమంది అధికారులు ఈ భూములను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. బ్రోకర్ల మధ్యవర్తిత్వంలో రిజిస్ట్రేషన్లు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

**ఎల్‌పీఎస్ స్కీం భూములే టార్గెట్**

దోమ మండల పరిధిలోని మోత్కూర్ రెవెన్యూ పరిధిలో పలువురు చెంచులు, మర్పల్లి, మదాసీ, కుక్కల కుటుంబాల వారికి.. 1987లో అప్పటి ప్రభుత్వం ఎల్‌పీఎస్(ల్యాండ్ పర్చేజ్ స్కీం) కింద భూములు ఇచ్చింది. వీటిని లబ్ధిదారుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసి హక్కులు కల్పించింది. వీటిని ఇతరులకు విక్రయించడమే లక్ష్యంగా కొంతమంది మధ్యవర్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు.

**చేతులు మారుతున్న భూములు**

మోత్కూర్‌కు చెందిన అబ్దుల్ రహీం నుంచి సర్వే నంబర్ 409లో ఆరు ఎకరాల భూమిని ఎల్‌పీఎస్ స్కీం కింద కొనుగోలు చేసిన అప్పటి ప్రభుత్వం.. ఈ స్థలాన్ని అర్హులైన చెంచులు, మర్పల్లి, మదాసీ, కుక్కల కుటుంబాలకు కేటాయించింది. ఇందులోని 1.28 ఎకరాల భూమిని 2023 అక్టోబర్ 17న ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. కుక్కల రామయ్య నుంచి 20 గుంటలు, మర్పల్లి తిమ్మయ్య నుంచి 16 గుంటలు, మర్పల్లి ఎల్లయ్య నుంచి 16 గుంటల భూమిని ఏదుల ఆంజనేయులు కొనుగోలు చేశాడు. అలాగే మర్పల్లి ఈశ్వయ్య నుంచి 16 గుంటల భూమిని సత్యనారాయణ అనే మరో వ్యక్తి కొనుగోలు చేశాడు. నిబంధనలకు విరుద్ధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన భూముల క్రయవిక్రయాలు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల అండదండలతో స్థానిక తహసీల్దార్ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **నిషేధిత జాబితాలో కనిపించలేదు**
>
> 
>
> ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద ఉన్న భూములు 22ఏ(నిషేధిత జాబితా)లో కనిపించలేదు. దీంతో సదరు రైతులు స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ కోసం వస్తున్నారు. ఈ మేరకు అన్ని అంశాలను పరిశీలించాకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. ఎల్‌పీఎస్ స్కీం కింద ఉన్న భూములను ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో చేరుస్తాం.
>
> – పురుషోత్తం, తహసీల్దార్, దోమ

# జైలు పాలైనా బుద్ధి రాలేదు

- ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకున్న పోలీసులు



పట్టుబడిన నిందితుడితో ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు

**పరిగి:** ద్విచక్ర వాహనాల చోరీ వ్యవహారంలో అతడు జైలు జీవితం గడిపాడు. అయినా అతగాడి బుద్ధి మారలేదు. విడుదలై కొన్నేళ్లకే మళ్లీ పాత ధోరణి అవలంబిస్తూ పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ మంగళవారం వెల్లడించారు. పరిగి పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కొడంగల్‌వైపు నుంచి ఓ వ్యక్తి బైక్‌పై రావడంతో పోలీసులు ఆపి పత్రాలు అడిగారు. దీంతో సదరు వ్యక్తి పత్రాలను చూపించకుండా పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమాల గ్రామానికి చెందిన నట్టలి హనుమంతుగా గుర్తించారు. అతడు దొంగలించిన బైక్‌తో పరారవుతున్నాడని తేలింది. ఇప్పటికే మూడు బైక్‌లు, ఒక స్కూటీ దొంగిలించానని అంగీకరించాడు. దీంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో పరిగి, తాండూరు ప్రాంతాల్లో బైక్ దొంగతనం కేసులో హనుమంతు నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడటంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# పంచాయతీ భవనాలు పూర్తయ్యేనా?

- చాలా చోట్ల ప్రారంభం కాని నిర్మాణాలు
- మరికొన్ని చోట్ల అర్ధాంతరంగా వదిలేసిన కాంట్రాక్టర్లు



దేశాయిపల్లిలో స్లాబ్ వేసి వదిలేసిన పంచాయతీ భవనం

**దౌల్తాబాద్:** గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం మండలంలోని 21 పంచాయతీలకు ఒక్కొక్క దానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులను ఎనిమిది పంచాయతీల్లో సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేపట్టారు. మిగతా పంచాయతీల్లో అసలు పనులే ప్రారంభించలేదు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించడానికి, రికార్డులు భద్రపర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మేరకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా దాపురించింది.

**భవనాలు మంజూరైన జీపీలు**

అల్లాపూర్, బండివాడ, గుముడాల, కుప్పగిరి, లొట్టికుంటతండా, నందారం, నంద్యానాయక్‌తండా, నీటూరు, పోల్కంపల్లి, చంద్రకల్, సుల్తాన్‌పూర్, సురాయిపల్లి, దేశాయిపల్లి, యాంకి, చల్లాపూర్, ఇందాపూర్, కొడీడ్, ఈర్లపల్లి, ఊరగుంట, నాగసార్, సంగాయిపల్లి గ్రామ పంచాయతీలకు 2022లో ప్రభుత్వం పక్కా భవనాలు మంజూరు చేసింది. అయితే 21 పంచాయతీల్లో ఒక్క నంద్యానాయక్‌తడాలో మాత్రమే పూర్తయింది. మిగిలిన 12 పంచాయతీల్లో పనులు ప్రారంభంకాలేదు. 8 పంచాయతీల్లో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ విషయమై పీఆర్ఏఈ నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. పంచాయతీల భవనాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించానని తెలిపారు. త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని వివరించారు.

# మలుపులు.. ప్రయాణానికి పాట్లు



మోమిన్‌పేట-చంద్రాయన్‌పల్లి మధ్యలో రోడ్డు మలుపు

**మోమిన్‌పేట:** మలుపులతో కూడిన రోడ్డుతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూచిక బోర్డులు లేక నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. మండల కేంద్రం మోమిన్‌పేట నుంచి చంద్రాయన్‌పల్లి మీదుగా కోల్కుందకు వెళ్లే మార్గంలో మలుపు ఉంది. అక్కడ అధికారులు ఎలాంటి సూచిక పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### విద్యుత్ వైర్ల చోరీ

**చేవెళ్ల:** నిర్మాణంలో ఉన్న ఇంట్లో దుండగులు విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ హైవే పక్కనే శ్రీ వెంకటేశ్వర హార్డ్‌వేర్ షాపు యజమాని ఆంజనేయులుగౌడ్ కొత్త భవనం నిర్మిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దుండగులు నూతన భవనంలోకి ప్రవేశించి విద్యుత్ వైర్లు, లిఫ్ట్ కోసం వేసిన వైర్లను దొంగిలించారు. ఈ విషయం సీసీ కెమెరాల ద్వారా వచ్చిన సిగ్నల్‌తో గుర్తించిన యజమాని వచ్చేసరికి దొంగలు పారిపోయారు. సుమారు రూ.3 లక్షల విలువ గల సామగ్రి ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### గృహిణి అదృశ్యం



రూబీదేవి (ఫైల్)

**పహాడీషరీఫ్:** గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సిద్దినాథ్ సాహు, రూబీదేవి(38) దంపతులు 18 ఏళ్ల క్రితం జల్‌పల్లికి వలస వచ్చారు. భర్త కొత్తూర్‌లో జాబ్ చేస్తుండగా, భార్య జల్‌పల్లిలో కిరాణ దుకాణం నడుపుతుంది. ఈ నెల 25వ తేదీన భర్త ఉదయం విధులకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చే సరికి భార్య కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లభించలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నిశిరాత్రి.. బైక్ అదుపుతప్పి

- పొదల్లోకి దూసుకెళ్లడంతో వ్యక్తి దుర్మరణం



మల్లేశ్ (ఫైల్)

**షాద్‌నగర్‌రూరల్:** రాత్రివేళ బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఉదయం వరకు ఎవరూ చూడకపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామశివారులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన అంబటి మల్లేశ్(42) అనిత దంపతులు. వ్యవసాయం చేస్తూ జీవనోపాధిని పొందుతున్నారు. మల్లేశ్ బైక్‌పై సోమవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో ఆయన దూసకల్ సమీపంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోకి రాగానే రోడ్డు మలుపు ఉండటంతో బైక్ అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

**రాత్రంతా ఎవరూ చూడలేదు**

భర్త ఇంటికి రాకపోవడంతో మల్లేశ్ భార్య అనిత ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో చీకటి కావడంతో ఇన్ముల్‌నర్వలోనే ఉన్నాడని అనుకుంది. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లే రైతులు రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి మల్లేశ్ ఫోన్‌తో ఇంటికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకొని మృతుడిని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ అనంతరాములు తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### బీసీ కులగణనకు సిబ్బంది ఎంపిక

**తాండూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బీసీ కులగణన సర్వేకు మండలం నుంచి 111 మంది సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు ఎంపిక చేశారని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి బీసీలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక అంశాలను సేకరిస్తారన్నారు. 57 అంశాలకు సంబంధించి ఫార్మాట్‌ను పూర్తి చేయాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి త్వరలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు.

# మా భూములు గుంజుకోవద్దు

- గోశాలకు కేటాయించడంతో దళిత రైతుల ఆందోళన
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- బాధితులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య మద్దతు



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

**మొయినాబాద్:** అరవై ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్నాం.. పంటలు పండించుకుంటున్నాం.. గోశాల పేరుతో ఇప్పుడు మా భూములు గుంజుకుంటే ఏలా బతుకుతాం.. అంటూ మండలంలోని ఎనికేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మంగళవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మండల పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 180లో 99 ఎకరాల ప్రభుత్వ భూమిని సుమారు అరవై ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. ఆ భూములను ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ గోశాలకు కేటాయించింది. తాము సాగుచేసుకుంటున్న భూములను గోశాలకు ఇవ్వొదంటూ బాధితులు ఆందోళన చేపట్టారు.

**వినతిపత్రం అందజేత**

విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బాధితులకు మద్దతుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అరవై ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్నామని.. అప్పట్లో పటేల్ పట్వారి వ్యవస్థ ఉండి తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేయలేదని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. సాగు చేసుకుంటున్నవారంతా దళిత కుటుంబాలకు చెందినవారమేనని.. ఈ భూములు గుంజుకుంటే తమకు బతుకుదెరువు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూములను గోశాలకు ఇస్తామని తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు గోడు వెలిబుచ్చారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..**

ఎనికేపల్లిలో దళితులు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూముల జోలికి అధికారులు వెళ్లొద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు సూచించారు. ఈ భూముల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. దళిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని.. ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్, రాజుగౌడ్, రాము, రమేశ్, శ్రీనివాస్ తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి





ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న పీఆర్‌టీయూ నేతలు

**మొయినాబాద్‌రూరల్:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. సంఘం మండల అధ్యక్షుడు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డిల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో పదేళ్లుగా ఉద్యోగోన్నతి లేకుండ ఉన్నామన్నారు. నూతన ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రమోషన్స్ షెడ్యూల్‌ను విడుదల చేయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రస్తుత పరిస్థితుల్లో రెండు డీఏలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే నాలుగింటిని అమలు చేయించడం జరిగిందన్నారు. రూ.వెయ్యి కోట్ల అదనపు భారం పడుతుందని గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లులను ప్రస్తుత సర్కారు చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం అబ్దుల్ హమీద్, నారాయణ పీఆర్‌టీయూటీఎస్‌లో చేరారు. సమావేశంలో బందయ్య, హన్మంతు, రవీందర్‌రెడ్డి, రేణుక, మల్లయ్య, సత్యనారాయణరెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, శివకుమార్, యాదగిరి, రాములు, వేణుగోపాల్, సంజీవన్‌కుమార్, లక్ష్మణ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుసుమ సాగుకు.. అదునిదే

- అంతర పంటలే కీలకం
- విత్తనశుద్ధితో తెగుళ్లు దూరం
- సస్యరక్షణ తప్పనిసరి
- తాండూరు ఏడీఏ రుద్రమూర్తి





కుసుమ పంట

**తాండూరు:** కుసుమ సాగు చేసేందుకు నల్ల రేగడి నేలలు అనుకూలమైనవి. ఈ పంట అధికంగా నల్గొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో సాగవుతోంది. జిల్లాలో కుసుమ పంటకు అనువైన భూములు ఉన్నప్పటికీ సాగు విస్తీర్ణం ఏటికేడు తగ్గుతోంది. అందుకు కారణం పంటకు ముళ్లు ఉండటంతో రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ విధానం రావడంతో పంట నూర్పిడులను యంత్రాల ద్వారా చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని తాండూరు వ్యవసాయ సహాయ సంచాలకులు రుద్రమూర్తి సూచించారు. కుసుమ సాగుపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు.

**పంట అనువైన సమయం**

- కుసుమను అక్టోబర్ రెండో పక్షం నుంచి నవంబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. వాతావరణంలో తక్కువ తేమ, అల్ప ఉష్ణోగ్రతలు పంట ఎదుగుదలకు దోహదం చేస్తాయి.
- కుసుమను ఏక పంటగా పండించేటప్పుడు ప్రతిసారి ఒకే పొలంలో వేసే బదులు పత్తి, లేదా కంది లాంటి పంటలను మార్పిడి చేయాలి. ఇలా చేయడం వల్ల కుసుమను ఆశించే ఎండు తెగులు రాకుండా అరికట్టవచ్చు.
- పంటలో శనగ లేదా ధనియాలు 1:2 నిష్పత్తిలో అంతర పంటగా సాగు చేస్తే అధిక ఆదాయాన్ని పొందవచ్చు.
- వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిని నష్టపోతే కుసుమ మంచి ప్రత్యామ్నాయ పంటగా మార్చుకోవచ్చు.
- కొద్దిపాటి క్షారత్వం గల సమస్యాత్మక భూముల్లో కుసుమను లాభదాయకంగా పండించవచ్చు.
- అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను సాగు చేసుకోవచ్చు.

**అనువైన నేలలు**

- నీరు నిలువని, బరువైన తేమను నిల్పుకునే నల్ల రేగడి నేలలు, నీటి వసతి గల ఎర్రగరప నేలలు కుసుమ సాగుకు అనుకూలం. ఆమ్లత్వం భూములు పనికి రావు.
- ఎకరానికి 4 కిలోలు(పూర్తి పంటకు), 1.5 కిలోలు(అంతర పంటకు) విత్తనాన్ని గొర్రుతోగాని నాగటి సాళ్లతో గాని విత్తుకోవచ్చు.

**విత్తన శుద్ధి**

- విత్తనం ద్వారా సంక్రమించే ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు, భూమిలోని శిలీంధ్రాల ద్వారా సంక్రమించే ఎండు తెగుళ్లను అరికట్టడానికి విత్తన శుద్ధి అవసరం.
- 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ లేదా 1 గ్రాము కార్బండిజం కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం**

- వర్షాధారంగా సాగు చేసినప్పుడు కుసుమ పంటకు ఎకరానికి 16 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులను అందజేయాలి.
- నీటి వసతి కింద సాగు చేసినప్పుడు సిఫార్సు చేసిన పోషకాలలో 50 శాతం నత్రజని(10–12 కిలోల యూరియా), భాస్వరాన్ని దుక్కిలో వేసుకోవాలి.
- మిగతా 50 శాతం నత్రజనిని, మరో 10 నుంచి 12 కిలోల యూరియాను 5 వారాల తర్వాత మొదటి తడి కట్టినప్పుడు పైపాటుగా వేయాలి.

**కాండం తొలిచే ఈగ**

పంటకు కాండం తొలిచె ఈగ కాండం ద్వారా లోపలికి ప్రవేశిస్తుంది. లోపలి భాగాన్ని తిని వేయడంతో మొక్క పైభాగం ఎండి పోతోంది. నివారణకు డైమిథోయేట్ 2.0 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేసుకొంటే పంటకు ఈగ బెడద తప్పుతోంది.

**పేనుబంక**

కుసుమకు పేను తాకిడి చాలా ప్రమాదకరమైనది. ఆలస్యంగా విత్తిన పంటపై దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఇది విత్తిన 40 నుంచి 45 రోజుల నుంచి పంటను ఆశించి ఒక వారం రోజుల్లో ఇబ్బడి ముబ్బడిగా సంతతిని పెంచుకుంటుంది. ఇది ఎక్కువగా లేతగా ఉండే మొవ్వ, చిగుళ్లు, ఆకు అడుగు భాగాలను ఆశించి రసం పీల్చడంతో మొక్కలు ఎండి పోతాయి. నివారణకు డైమిథోయేట్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.